C.P. Brown ACADEMY సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లి ఉగాది కథలపోటీలో

**తృతీయ బహుమతి రూ. 5,000 పొందిన కథ**

# కాటు

కట్టుకోలు సుబ్బారెడ్డి



వలస వస్తున్న ప్రజల భారం మోయలేని ఆ పెద్దగ్రామం నెమ్మదిగా కూర్చుని, ఆపైన వెల్లకిలా పడుకొని పట్టణ మయ్యింది. మనుషుల భాషా, భావాలూ కూడా కారపు అటుకులూ బెల్లం కలిపినట్లుగా మారాయి. అన్నీ సంకరమయ్యి స్వంతానివేవో తెలీకుండా పోవడానికి అట్టేకాలం పట్టలేదు. నిజాయితీ సైతం అప్పుడప్పుడూ కుంటుతోంది.

ఒకప్పుడా సెంటరు రెండు సినిమాహాళ్ళతోటి అట్టహాసంగా ఒక వెలిగిందే! ఇప్పుడు యవ్వనమంతరించిన మనిషిలాగా ఉసూరు మంటోంది! పక్కపల్లెలకు వెళ్ళే ప్రైవేటు బస్సులకు ప్రధాన కూడలిగా ఉండేదల్లా ఆ బస్సులు పోవడంతో ఆటో వాళ్ళకు ఆవాసంగా మారింది. ఒక సినిమాహాలు మూసేసి షాపింగు కాంప్లెక్సు చేసే పనిలో వున్నారు. ఇంకో సినిమాహాలు మాత్రం చాటు సరసగాళ్ళకు సంకేతస్థలంగా మారింది. ప్రక్కగోడేమో... ఆటోలవాళ్ళకూ, సినిమాకొచ్చిన కొద్దిమందికీ ఇంటర్వెల్లుల్లో జిప్పులు తీయడానికి పనికొస్తోంది. కొత్తసినిమా అయితేనో, అప్పుడు చూద్దామంటే పడలేదు! ఇప్పుడన్నా చూద్దామనుకునేవారో, కొద్దిమంది తప్పించి పూర్వంలాగా ఈ సినిమాహాలుకు జనమొస్తున్న దాఖలాలు లేవు? సినిమా హాలు కొచ్చే ఆ నలుగురు కూడా ఏదో ఒక మోటారుసైకిలో, మోపెడో వేసుకొస్తున్నారు. ఇక రిక్షా లెక్కే వారేరి?.

గత పాతికేళ్ళుగా రిక్షా తొక్కడం తప్ప మరేమీ చేతగాని రిక్షావాళ్ళు ఆ గోడనానించే రిక్షాలు పెట్టు కుంటున్నారు.

రిక్షా ఓనర్లకు కూడా ఈ పుంజీడు మంది డ్రైవర్లు తప్ప మరి గతిలేదు?.. ఈ రిక్షాలు అమ్ముదామంటే పొయ్యిలో పెట్టుకునే పుల్లలకు! తప్ప ఎందుకూ పనికి రావు? ఏదో.. ఆ పాతవాళ్ళే అద్దె ఇచ్చి ఇవ్వకా నెట్టు కొస్తున్నారు.

అంతా సరిగా వున్నరోజులలోనే పావువంతు ఆక లితో ఉండే రిక్షా వాళ్ళిప్పుడు ముప్పావాకలితో వుంటు న్నారు!

ఆకలిగా ఉన్నప్పటికీ మొద టాట విడిచిపెట్టేక గిరాకీలు మాచుకొని ఇంటికెళదామనుకుంటున్నాడు నర సయ్య.

చాలామంది పొద్దున్నే తిని నింపే ఇడ్లీ స్థానాన్ని మధ్యాహ్నం తిన్న పరోటాతో భర్తీ చేయలేక పోయాడు.

సాయంకాలం తొక్కిన కిరాయి డబ్బుతో బ్రాకెట్టా డాడు! చీకటిపడ్డాక తొక్కిన కిరాయి డబ్బుతో గంజాయి తాగాడు! 'యెల్లెల్రా, నువ్విచ్చే ఈ ముట్టి కిరాయి డబ్బుకు ఈ నలకంత గంజాయి కాక గవ నేరు తాగే యిస్కీ సీసాలొక డజనొత్తాయి? అలా గ్గూసో తెచ్చిత్తా!.... నలకంతట!... నలకంత!... యద వని!.... యదవ! నాతో యెట్టుకోమాకొరె!... నాగ్గాని తిక్కొచ్చిందంటె నాననలే మంచిదాన్ని కాదు?' అని గంజాయి అమ్మే అమ్మి చీదరించుకోవడం గుర్తొచ్చి పళ్ళు కొరికాడు. కొరుకుడుకు పిప్పి పన్ను నొప్పొచ్చి ఆపాడు.

ఆఖరు కిరాయి తనుండే ఇంటివైపే గాబట్టి తక్కువ కొప్పుకున్నాడు.

చిల్లరలేదన్న నెపం మీద ఇస్తానన్న కిరాయికూడా తగ్గించిచ్చి తూలుకుంటూ వెళ్ళినవాణ్ణి గొణుగుడుగా బూతులు తిట్టుకుంటూ ఇంటికొచ్చాడు.

***

పేరుకు తగినట్లుగానే పేషెంట్లంటే కరుణతో ఉంటావమ్మాయ్! అన్నాడు లోగడో పెద్దాయన. పుట్టుకతో వచ్చిన బుద్ధికితోడు ఈ ప్రశంసను పోగొట్టు కోకుండా వుండడానికా? అనేట్లు మరింత కరుణ పూరితంగా వుండ సాగింది కరుణ!.

ఆస్పత్రి మెయినుగేట్లో సన్నపాటి శబ్దంతో ఏడుపు వినిపిస్తోంది! ఏమిటోనని బయటికొచ్చింది. ఆ రోజు నైట్‌డ్యూటీ చేస్తున్న కరుణ. చదువుతున్న పుస్తకంలో గుర్తుకోసం మందులు రాసే చీటీనొకదాన్ని ఆ పేజీలో ఉంచడం మరువలేదు.

ఓ పదహారు పదిహేడేళ్ళున్న కుర్రాడు కనబ డ్డాడు. ఆ కుర్రాడూ ఇంకో బక్కచిక్కిన ఆడమనిషీ కలిసి అర్ధ స్పృహలో వున్న ఒకతన్ని రిక్షాల నుండి దింపుతున్నారు. ఇందాక వినిపించిన ఏడుపు ఈ స్త్రీదై వుంటుంది? అని ఊహించింది.

''నర్సమ్మా... నా మావని పురుగుముట్టింది నర్సమ్మా!'' చెప్తూనే బావురుమంటూ ఏడ్చిందా స్త్రీ.

''పురుగు ముట్టట మేమిటమ్మా?'' అనటమైతే అనేసిందిగానీ రెప్పపాటు తరువాత అసలు విషయం అర్థమైంది.

''పామండీ... పాము కరిసింది!''

''లోపలికి తీసుకురండి. ఏం పాము? కాటేసి ఎంతసేపయ్యింది?'' అని అడుగుతూనే లోపలికి దారితీసింది.

''యిప్పుడే... కాసేపవ్వుద్ది!... ఏంపామో తెల వదు? పారిపోయింది! నా మావను కాపాడు నర్సమ్మా... చచ్చి నీ కడుపున పుడతా'' ఏడుస్తూనే చెప్పింది.

ఆ సరికి అందరూ వరండాలో కొచ్చారు. మామూలుగా పగటిపూట తమ తమ పిలుపులకోసం ఎదురుచూస్తూ రోగులందరూ కూర్చోడానికి బెంచీలు ఏర్పాటుచేశారు. ఆ బెంచీలలో ఓ దానిమీద అతన్ని పడుకోబెట్టారు. లైటు వెలుతు రులో అప్పుడతన్ని పరిశీలనగా చూసింది. విషం ప్రభావం మూలంగానో, భయం మూలం గానో అతని కాళ్ళూ చేతులూ వేళ్ళాడబడిపోయాయి!

ఇప్పుడతనికి మందులెంత అవస రమో ధైర్యం కూడా అంతే అవసరం! ఈ విషయాన్ని తెలిగ్గానే గ్రహించింది కరుణ.

అయినా ఆ విషయాన్ని గ్రహించడా నికి కొద్దిపాటి తెలివి తేటలుంటే చాలు!


''ఇదుగోబాబూ... ఇటుచూడూ.... నీ పేరేమిటి?'' మృదువుగా చెంపలు తట్టుతూ పిలి చింది.

''నరిసిగాడండి'' అని ఎవరో అనడం వినిపిం చింది.

''కాదు... 'నరసయ్య' అమ్మగారూ'' అందా స్త్రీ.

''మీరిద్దరలా ఆగండల్లా... అడిగింది మిమ్మ ల్నేటి? నరసయ్యనయితేని!'' అని ఇంకో మగగొంతు వినిపించేసరికి వెనుదిరిగి చూచింది కరుణ. చీకట్లో తను చూళ్ళేదుగానీ ఇప్పుడు వెలుతురులో ఐదారు గురు మనుషులు కనబడుతున్నారు. నరసయ్యనూ ఆ స్త్రీనీ రిక్షాలో ఆ కుర్రాడు తీసుకొచ్చుంటాడు. మిగి లినవారు కాలి నడకన వచ్చుంటారు. వాళ్ళలో నుండి ఓ మనిషి కొంచెం ముందుకొచ్చాడు.

''ఆడి పేరు నరస య్యండి 'నరిసిగా'డంటా వండి. ఇదాడి పెల్లాం



రత్తమ్మ. మేవంతా ఇరుగుపొరుగాల్లం. ఆడు అద్దె రిచ్చా తొక్కుతాడండి'' మీరిద్దరూ ఆగండి అన్నది ఇతనేనని గొంతుని బట్టి గుర్తించింది.

''సరే... నీ పేరేంటి.. ఏం జరిగిందో వివరంగా చెప్పు'' అంది.

''నన్ను 'ముత్తయ్య'నంటారండి. మొదటాట సినిమా కిరాయిలు జూసుకుని నరిసిగాడు ఇంటికొచ్చాడంటండి! అన్నం తిందారని కాల్లు కడుక్కోనాకి యెల్లేడంటండి. అదా దడి పక్కనుంది కామోసండి? యీడు దాన్ని గానీ తొక్కేడో? మరి తొక్కనేదో? గానండీ... మరిది ఇసప్పురుగో? కాదోగానండి?... అదీణ్ణి కుట్టిందంటండి. ఆపళంగా ఆణ్ణి ఆడుతొక్కే రిచ్చాలోనే ఆడి పెల్లామూ, కొడుకూ ఏసుకొచ్చారండీ. మేవంతా ఎనగ్గా వచ్చామండీ... అదండీ జరిగింది'' అన్నాడు.

''అయితే ఏం పామో తెలీదన్నమాట?'' జనాంతికంగా అంది కరుణ.

''తెలవదండీ!'' జనం.

కరుణ ఆలోచనలో పడింది. పాము కాటుకు తమ డాక్టరు వైద్యం చేయటాన్ని చాలాసార్లు చూసింది. డ్యూటీలో భాగంగా సహాయపడింది కూడాను. తమ ఆసుపత్రిలో పాము విషానికి విరుగుడు ఇంజెక్షనులున్నాయి. ఇలాటి అత్యవసర పరిస్థితిలో తాను ధైర్యంగా వైద్యమూ చేయగలదు! కానీ కరిచిన పాము విషపుది కాకపోతే అంతంత ఖరీదైన ఇంజెక్షనులు చేయడం అనవసరం. మామూలు వైద్యం సరిపోతుంది.

అయినా వీళ్ళంతా పేదవాళ్ళలాగా? కనబడుతున్నారు. అంతంత ఖరీదు వీళ్ళు భరాయించగలరో? లేదో తెలీదు? ఇలాటి పరిస్థితిలో డాక్టరు గారుంటే అంతా ఆయనే చూచుకొనేవారు!

పాముల సంచారం పగటి పూట కంటే రాత్రుళ్ళే ఎక్కువనీ?

పాము కాటు వేశాక అంతా అత్యవసరమే గానీ స్థిమితానికి చోటుండదనీ, ఒంటరిగా ప్రాక్టీసుచేసే డాక్టర్లు సాధారణంగా రాత్రిపూట ఇంట్లోనే ఉంటారనీ కరుణకు గుర్తురాలేదు. ఇప్పుడు హడావిడిగా డాక్టరు గారింటికి కబురుచేసి ఆయన వచ్చి ట్రీట్మెంటు మొదటు పెట్టేటప్పటికి పుణ్యకాలం కాస్తా అయిపోయి ఈ పేషెంటు పరిస్థితి ఏమౌతుందో ఏమో?

మామూలు పామేమోలే అనుకొని ఉదాసీనంగా మామూలు వైద్యం చేస్తే ఇతని ప్రాణం పోయినా పోవచ్చు!

విషపు పామేలే అని విరుగుడు మందిద్దామంటే ధైర్యమూ, తెగింపూ, ఉత్సాహమూ లాటి రకరకాల భావాలనేకం ఒక్క క్షణంలో పుట్టి గిట్టాయి!

తోచిన ప్రతి ఆలోచనను చివరివరకూ కొనసాగించడానికి వ్యవధి లేక పోయింది!?

ఆలస్యం చేస్తే పేషెంటుకేమన్నా ఔతుందేమో అనే ఆలోచన, కరుణని మరింత తొందర పెట్టింది?

''ఎట్టాగయినా నా మావను కాపాడు నర్సమ్మా'' నెత్తిబాదుకుంటూ, ఏడుస్తున్న రత్తమ్మ.

''ఇంజక్షనులు చెయ్యాలి, సెలైను పెట్టాలి, డబ్బులున్నాయా? అసలు డాక్టరు గారేమంటారో?'' ఏ

## ప్రేరణ నా మనవడే!



సి.పి.బ్రౌన్ అకాడెమీ - నవ్య వీక్లీ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో నా కథను బహుమతికి ఎంపిక చేసి నన్ను పెద్దవాడిని చేసినందుకు సదా కృతజ్ఞుడను. 'కాటు' అంటే ఏమిటి తాతయ్యా అని ఒక రోజు నా మనవడు 'శ్రీశ్రీ రెడ్డి' అడగడమే ఈ కథ నేను అల్లడానికి కారణం. నా వయసు 56 సంవత్సరాలు. నిరంతరమూ చదవటమన్నా, చదివినంతసేపూ ఘంటసాల మాస్టారును వినటమన్నా ఇష్టం. నేను చదువుకుంటున్నా, వ్రాసుకుంటున్నా నన్ను భరిస్తున్న నా భార్య కుమారికీ, నా సహచరుడు రాంబాబుకూ, మరోసారి 'నవ్య'కు నా హృదయపూర్వక ధన్యవాదాలు.

**-కట్టుకోలు సుబ్బారెడ్డి**

**94401 76567**

మాత్రమూ బలం లేని గొంతుతో అడిగింది కరుణ.

''అమ్మా... అమ్మా... నరసమ్మా... తెల్లారంగానే తెచ్చిత్తా తల్లీ, నీకు మాట రానీయను తల్లీ!'' అంది రత్తమ్మ కాస్త తేరుకుంటూ!

అంతేతప్ప ఆ ఇంజెక్షను గానీ, సెలైను గానీ, ఎంతని? మాత్రం అడగలేదు.

ఎంతయినా తన దగ్గరలేవని రత్తమ్మకు తెలుసు కాబట్టి ఎంతని అడగ లేదా?

ముందు మొగుడు బ్రతికి బయటపడితే ఆ తరువాత సంగతి తరువాత చూడొచ్చనుకుందా?

అసలంత దూరం ఆలోచించనే లేదా? ఆ భగవంతుడికే తెలియాలి.

ఏం చేయాలో కరుణకు పాలు బోవటం లేదు.

ఏదయితే అదవుతుంది.. వైద్యం చేయాలి.

చేతనైతే ప్రాణాన్ని పోయాలి... అంతేగాని... చూస్తూ చూస్తూ ప్రాణాన్ని పోగొట్టకూడదు.

ఉద్వేగమాగడం లేదు.

అది ఉద్వేగమా? ఉత్సాహమా?

కరుణ తెలుసుకో గలిగిన స్థితిలో లేదు.

ఆ స్థితిలోనే - కొత్తగాచేరిన కాంపౌండరు సాయంతో చకచకా ఏర్పాట్లు చేసింది. లోపలికెళ్ళి సెలైను బాటిలు తెచ్చి పేషెంటుకు అమర్చి దాన్లోకి పాముకాటుకు విరుగుడు మందు ఎక్కించింది.

ఓ గంటపోయాక పేషెంటు పరిస్థితి ఆశాజనకంగా మారింది. చూపు నిలకడయ్యింది. మరి కాసేపటికి మాట్లాడసాగేడు. తెల్లవారేటప్పటికి చాలా వరకూ కోలుకున్నాడు.

***

డాక్టరు రాగానే రాత్రి జరిగిందంతా భయపడుతూనే వివరంగా చెప్పింది.

కరుణ వంక డాక్టరు అప్రసన్నంగానూ! విసుగ్గానూ! చూశాడు.

తప్పు? చేసిన దానిలాగా తలవంచుకుని నిలబడిపోయింది.

మామూలుగా రౌండ్స్ అయిపోయిన తరువాత నైట్ డ్యూటీ వాళ్ళు ఇంటికెళ్ళటం ఆనవాయితి.

డాక్టరు మౌనం కరుణకు భయం కలిగించసాగింది. రౌండ్స్ కెళుతోన్న డాక్టరును అప్రయత్నంగానే అనుసరించింది.

''కరుణా... ఇతనేనా... స్నేక్ బైట్ పేషెంటు... ఆ ఏమయ్యా! ఎలా వుంది?'' ఏ భావమూ లేని గొంతుతో డాక్టరు.

''దండాలుబాబయ్యా... బాగానే వుందండి'' లేచి నిలబడబోయిన నరసయ్య.

నిలబడబోయిన అతని ప్రయత్నాన్ని గురించి ఎవరూ ఏమీ అనలేదు.

డాక్టరు మౌనంగా అతన్ని కూడా అందరిలాగానే పరీక్షించాడు.

''ఊ అంతా బాగానే వుందయ్యా! అయినా ఈ పరీక్ష చేయాలి?'' అంటూనే చేయవలసిన రక్తపరీక్ష పేరు చీటీమీద రాశాడు. పేషెంటు ప్రక్కన ఎవరూ కనబడక ఆ చీటి అతని చేతికే ఇచ్చాడు.

''రాత్రొచ్చిన ఆ పేషెంటు తాలూకూ వాళ్ళు డబ్బులెప్పుడు కడతానన్నారు కరుణా?'' రూముకు రాగానే డాక్టరు అడిగిన మొదటి ప్రశ్న. చాలా సాధారణమైన ప్రశ్నే! ఎందుకో తెలీదు... ఈ రోజు ఆ ప్రశ్నే కరుణకు మనసును 'గిల్లిన' భావన తెస్తోంది.

''ఈ పూట కడతానన్నారండీ'' ఏమి చెప్పిందో కూడా తెలియని మనో స్థితిలో కరుణ.

''అతని తాలూకు వాళ్ళు ఎవరూ ఉన్నట్లు లేదే అతని పక్కన?'' నెమరు కణత మీద తగిలిన బాణం దెబ్బలాటి ప్రశ్న? రౌండ్స్‌లో డాక్టరుతో పాటూ తానూ వున్నా తన మెదడు నమోదు చేయని వ్యాపార విషయం.

''డబ్బు తేవడానికి వెళ్ళుంటారు సార్'' ఏ మాత్రం ఆలోచించని సమాధానం.

అనాలోచితంగా చెప్పిన ఈ సమాధానం అబద్ధంగా పరిణామం చెందే అవకాశం వుందని తెలియని అనుభవరాహిత్యం.

''బ్లడ్ రిపోర్ట్రాగానే నాకు చూపించమని చెప్పు, వీలయితే సాయంకాలం ఇంటికి పంపించేస్తామని చెప్పి నువ్వెళ్ళు''.

ఇంటికెళ్ళబోతూ నరసయ్య దగ్గరకు వెళ్ళింది. నీరసంగా కనబడ్డాడు. రాత్రి జరిగిన విషయమంతా అతనికే చెప్పిందో తనకు తాను చెప్పుకుందో తెలీదు గానీ... చెప్పటమైతే చెప్పింది. ఆస్పత్రికి కట్టవలసిన డబ్బు మొత్తం వినగానే నరసయ్య ముఖంలోని రక్తమంతా ఇగిరిపోయింది.

''నీ భార్య ఏది నరసయ్యా?'' అన్న ప్రశ్న అతనికి వినబడనే లేదో? ఆ ప్రశ్నకు సమాధానం ఆశించకుండానే అడిగిందో...!

రాత్రి నిద్రచాలని దానిలాగా!.... నిద్రలో నడుస్తున్న దానిలాగా! ఇంటి కెళ్ళింది.

ఇంటిదగ్గర ప్రతిరోజులాగా మెలగలేక పోయింది. మధ్యాహ్నం నిద్ర కూడా సరిగా లేకపోయింది. సాయంకాలం రావలసిన టైముకన్నా ముందే

ఆస్పత్రి కొచ్చింది. తోటి నర్సు చెప్పిన 'మాట' వినేటప్పటికి ఎక్కడలేని నీరసమూ వచ్చింది. తడబడే అడుగులతో వెళ్ళి డాక్టర్ గారికి కనబడింది.

''ఏంటి కరుణా–రాత్రి వచ్చిన 'నీ పేషెంటూ' అతని తాలూకు వాళ్ళంతా ప్రొద్దున నువ్వటు వెళ్ళగానే బిల్ పే చెయ్యకుండానే పారి పోయారంట గదా? నీకు తెలుసా?'' అన్నాడు

బిల్లు కట్టలేకే పారిపోయారో? భార్యాభర్తలిద్దరూ కలిసి ఎవరినన్నా కాళ్ళా వేళ్ళాబడి డబ్బుతేవడానికి వెళ్ళారో? ఈ రెండూ కాక మరేమన్నా కారణముందో? తెలుసుకోవాలంటే కొంతకాలం వేచి వుండే ఓర్పుకావాలి! అంతదూరం ఆలోచించడానికి ఏ మాత్రమూ వెసులుబాటు లేని వేగ వంతమ్మైన, యాంత్రికమ్మైన జీవితాలు గడిపేవారు అనేకులు! డాక్టర్లను కూడా ఆ జాబితాలో నుంచి మినహాయించలేము! డబ్బు తీసుకు రావడానికైతే ఇద్దరూ వెళ్ళనక్కరలేదు కదా? అందునా చెప్పకుండా వెళ్ళనక్కరలేదు కదా? కాబట్టి పారిపోయే వుంటారు! ఇది జీవితానుభవం లోనుంచి వచ్చే తిరుగులేని తర్కం!

తను ఆస్పత్రికి రాగానే తోటి నర్సు తనతో చెప్పిన తొలిమాటే ఇది. అయినప్పటికీ 'పారిపోయారంట గదా? నీకు తెలుసా?'

అన్న ప్రశ్నను వాళ్ళు పారిపోవడం 'నీకు తెలిపే పారిపోయారా?' అన్న ప్రశ్నగా భావించిన కరుణ ''తెలియదు సార్'' అంది.

''సరే ఇప్పుడు తెలుసుకో!... ఇంతకూ ఆ బిల్లెవరు కడతారూ?'' నొసలు ముడివేసి సూటిగా చూస్తున్న డాక్టరు.

''..........''

''సరే... నీ జీతంలో నుంచి రెండు మూడు వాయిదాలుగా కట్ చేస్తాను. ఈ విషయాన్ని హాస్పిటలు డైరీలో గుర్తుకోసం రాసిపెట్టు... ఇక ముందెప్పుడూ ఇలాటి పనులలో తల దూర్చకు... ఇక నువ్వు నీ పని చూసుకోవచ్చు.'' ఏ నెల జీతం ఆ నెల ఇస్తున్నాము కాబట్టి సంవత్స రాల తరబడీ చేసిన సర్వీసును ఎందుకు గుర్తుంచుకోవాలో ఆలోచించ నక్కరలేని డాక్టరు.

నీరసంగా బయటికొచ్చింది కరుణ.

రాత్రి జరిగిన దానినీ... దానికి తన రియాక్షనునూ స్థిమితంగా నెమరు వేసుకోసాగింది!

సమీకరించిన సమాచారాన్నంతా మనసులోని ఒక చిన్నభాగం – నిశితంగా సమీక్షించి, విమర్శించసాగింది!?

నరసయ్య ప్రాణాన్ని తాను స్వయంగా రక్షించాలనుకోలేదా!?

స్వంతంగా వైద్యం చేయాలనుకోలేదా!?

'ఎలాగైనా నీకున్న చాకచక్యమూ, ధైర్యమూ మాకుండవక్కా' అని తోటి నర్సూ...

'యెలాగోలా నా మావను బతికించావు తల్లీ! నా శర్మంతో నీకు సెప్పులు కుట్టించిచ్చినా నీ రునం తీరదు? నువ్వూ నీ బిడ్డలూ సల్లగా వుండాలి తల్లీ!' అని రత్తమ్మా.

'ఈ నరుసమ్మే గానీ రాత్రి లేప్పోతే నరిసిగాడి పెల్లాం తెల్లారేటప్పిటికి ముండమోసేది!' అని వాళ్ళవాళ్ళూ...

'సమయానికి నువ్వు సరిగా స్పందించావు. గాబట్టి సరిపోయింది. లేకపోతే ఆ పేషెంటు మరణించినా మరణించేవాడు? వెరీగుడ్ కరుణా... వెరీ గుడ్, యు డిడె గుడ్ జాబ్' అని తమ డాక్టరూ.

'మీ కరుణలాటి నర్స్ నాక్కూడా ఉంటే నాక్కూడా ఏ మాత్రం దిగులుండదు డాక్టర్' అని తమ డాక్టరుతోటి పక్క పేటలోని డాక్టరూ... అంటారనీ!?.... అనాలనీ!?... తన మనసులో... లోలోపల.... లో లోపలి పొరలలో... అంతరాంతాలలో ... లోలోపలి అంతరాంతాలలో... గుప్తంగా, గూఢంగా, గోప్యంగా... అనుకోలేదా!? అనుకోనేలేదా!?.. అనుకుని... ఆనందించలేదా!?

పై ఆలోచనలన్నీ తనకెప్పుడొచ్చాయి?

తాను వైద్యం మొదలెట్టక ముందొచ్చాయా?

మొదలెట్టేక వచ్చాయా?

వైద్యం చేయడం అయిపోయాక వచ్చాయా?

ఈ ప్రశ్నలన్నిటికీ కరుణ వద్ద సమాధానం లేదు? ఉన్నా చెప్పలేదు?

బ...హు... శా.... చె... ప్ప....దు!?

ప్రాణహాని ఉన్నప్పుడో? గత్యంతరం లేని పరిస్థితిలోనో తప్ప పాము కాటెయ్యదు? తాను కాటు వేసేది ధనికుణ్ణా దరిద్రుణ్ణా అన్నది కూడా పాముకు తెలీదు. పాముకాటు తినే పరిస్థితులు పేదవారికే ఎక్కువని మాత్రం ఎందరికో తెలుసు.

❋

